చదువుల ఉద్యానవనం

లావేరు మండలం మురపాక గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం చక్కని ఉద్యానవనాన్ని తలపిస్తోంది. పచ్చని చెట్లు, అందమైన బొమ్మలు, విజ్ఞానం పెంచే పరికరాలతో విద్యాలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. ఇంటిని మరిపించేలా ఆహ్లాదకరమైన వాతావరణం, మంచి విద్య అందుతుండటంతో పిల్లలు ఆసక్తిగా చదువుకుంటున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నిజంగా సరికొత్త విద్యా విప్లవం కొనసాగిందనడానికి ఈ విద్యాలయమే ఉదాహరణగా చెప్పవచ్చు. – ఎచ్చెర్ల


పాఠశాల ఆవరణలో పచ్చదనం


మురపాక కస్తూర్బా గాంధీ విద్యాలయం


కేజీబీవీ గేట్


గోడలపై ఆకట్టుకునేలా బొమ్మలు


పాఠశాల ముందు మొక్కలు

క్లుప్తంగా

25న అయ్యప్పకు అభిషేకాలు



శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని ధర్మశాస్తా ఆలయంలో అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు ఈ నెల 25న నిర్వహిస్తున్నట్లు అర్చకులు బాల భాస్కరశర్మ తెలిపారు. ఉదయం స్వామివారికి అష్ట ద్రవ్యాలతో అభిషేకాలు, పుష్పార్చనలు, సాయంత్రం అయ్యప్పస్వామి పడిపూజ, భజనలు జరుతాయని పేర్కొన్నారు. గురుస్వాములు, అయ్యప్ప భక్తులు పాల్గొనాలని కోరారు.

గురు దత్తాత్రేయస్వామికి పూజలు


దత్తాత్రేయునికి అభిషేకాలు

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరాన ఉన్న బాలాత్రిపుర కాలభైరవ స్వామి దేవాలయంలో గురు దత్తాత్రేయ స్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష గురూజీ ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు.

షిర్డీసాయికి విశేష పూజలు


పూజలందుకుంటున్న షిర్డీసాయినాథుడు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఇలిసిపురం, ద్వారాకానగర్‌లోని షిరిడీసాయి బాబా సేవా సంస్థాన్ మందిరంలో స్వామివారికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు హారతులు ఇచ్చి అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. బొందిలిపురంలోని దర్బార్ షిరిడీసాయి బాబా మందిరంలో అర్చకులు సంతోష్ బ్రహ్మ, సురేష్ బ్రహ్మల ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


ఎచ్చెర్ల: అదపాక పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఎచ్చెర్ల: పోలింగ్ కేంద్రాల్లో ప్రభుత్వ నియమాలను పాటించాలని, అన్ని ఏర్పాట్లు సక్రమంగా ఉండాలని లావేరు ఎంపీడీఓ కొండలరావు తెలిపారు. గురువారం లావేరు మండలంలోని అదపాక, గుర్రాలపాలెం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

తప్పుడు పోస్టులు పెడుతున్నారని ఫిర్యాదు

శ్రీకాకుళం అర్బన్/శ్రీకాకుళం క్రైమ్: పార్టీ ప్రతిష్టను దెబ్బతీసేలా సామాజిక మాధ్యమాల్లో కొందరు తప్పుడు పోస్టులు పెడుతున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.పరమేశ్వరరావు సైబర్‌సెల్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసినవారిలో నాగభూషణరావు, దిలీప్, ప్రసాదరావు, మధుసూదనరావులున్నారు.

గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు


రావాడలో తనిఖీలు చేస్తున్న ఎంపీడీఓ రమణమూర్తి

రణస్థలం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లోని రాజకీయ ప్రచార చిత్రాలు, పోస్టర్లు ఉండకూడదని ఎంపీడీఓ ఆర్.వి.రమణమూర్తి తెలిపారు. మండలంలోని రావాడ, యర్రవరం పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు చేశారు. గ్రామాల్లో ఇంటింటికీ అంటించిన ప్రభుత్వ, ప్రతిపక్షాల ప్రచార పోస్టర్లను తొలగించారు. జూనియర్ అసిస్టెంట్ భానుప్రకాష్, పంచాయతీ కార్యదర్శి గోపమ్మ, ఎంపీడీఓ అసిస్టెంట్ పి.సీతయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ కవితా దినోత్సవం


ప్రపంచ కవితా దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కవులు

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో శ్రీ అపార్ట్‌మెంట్‌లో గురువారం ప్రపంచ కవితా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా తెరవే అధ్యక్ష కార్యదర్శులు యు.నాగేశ్వరరావు, ఆర్.వి. రమణమూర్తిల ఆధ్వర్యంలో కవి సమ్మేళనం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన హెచ్‌ఎం బి.ఉమామహేశ్వరరావు, పలువురు కవులు మాట్లాడుతూ అక్షరపు విత్తులు నాటి ఊహలతో సాగు చేసిన వారు కవులని పేర్కొన్నారు.

కత్తి కంటే పదునైనది కలమని, మనిషినే కాదు సమాజాన్ని మార్చగలిగే శక్తి ఒక్క కలానికే ఉందని చెప్పారు. కవులు సీహెచ్.ఈశ్వరరావు, చాడ శ్రీనివాస్, తంగి ఎర్రమ్మ, మంగిపూడి శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, రమణమూర్తి, ఉమాకవి, సత్యనారాయణ, మల్లేశ్వరరావు, కిమ్మి సంతోష్‌లు సామాజిక అంశాలపై కవితలను వినిపించారు. అనంతరం ప్రపంచ కవితా దినోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

వేతన ఒప్పందం ఖరారు


వేతన సవరణ పత్రాలు ప్రదర్శిస్తున్న కార్మిక యూనియన్, పరిశ్రమ ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: అరిణాంఅక్కివలసకు చెందిన నాగార్జునా ఆగ్రికెం పరిశ్రమలో వేతన ఒప్పందం ఖరారైంది. యాజమాన్యం, కార్మిక యూనియన్‌లు గురువారం ఒప్పంద పత్రాలు ప్రదర్శించాయి. 18 నెలల పాటు సుదీర్ఘ చర్చల అనంతరం వేతనాలు అమలు చేయడంలో ఉమ్మడి అంగీకారానికి యాజమాన్యం అంగీకరించిందని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సి.హెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు తెలిపారు. కార్మికులకు రూ.3750 నెలవారీ వేతనం పెంపు, అలవెన్స్, బోనస్‌లు, వేజ్ బోర్డ్‌కు యాజమాన్యం అంగీకరించిందన్నారు. యూనిట్ హెడ్ శేషగిరిరావు, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

బంటుపల్లిలో ఫ్లాగ్ మార్చ్


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు

రణస్థలం: సార్వత్రిక ఎన్నికల్లో నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జే.ఆర్.పురం ఎస్సై కె.గోవిందరావు తెలిపారు.

మండలంలోని బంటుపల్లిలో గ్రామంలో కేంద్ర రక్షణ బలగాలు, సివిల్ పోలీసులు గురువారం ప్రజాచైతన్యం కల్పిస్తూ పోలీస్ కవాతు నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా, ఎన్నికల విధులకు ఆటంకం కల్పించినా క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు.

సచివాలయ ఉద్యోగులకు నోటీసులు

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని కుప్పిలి, బుడగుట్లపాలెం, సంతసీతారంపురం, ఎచ్చెర్ల గ్రామ సచివాలయాల్లోని కొంతమంది సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండటంతో గురువారం సంజాయిషీ నోటీలు జారీ చేశారు. ఈ సచివాలయాలను ఎంపీడీఓ రమాదేవి ఆధ్వర్యంలోని అధికారులు బుధవారం పరిశీలించారు. పరిశీలన సమయంలో కుప్పిలి, బుగడుట్లపాలెం సచివాలయాల్లో అందుబాటులో సిబ్బంది ఒక్కరు కూడా లేరు. ఎచ్చెర్ల, సంతసీతారంపురం సచివాలయాల్లో ఇద్దరు చొప్పున లేరు. వారి వివరణ అనంతరం తదుపరి చర్యలు ఉంటాయని అధికారులు తెలిపారు.

గురుకులానికి ఎంపికైన విద్యార్థి

ఎచ్చెర్ల: లావేరు మండలం బయ్యన్నపేట గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న కొన్ని ధర్మేంద్రనాయుడు రాష్ట్రస్థాయి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల పరీక్ష ఫలితాల్లో 50 మార్కులకు 42 మార్కులు సాధించి గురుకులంలో ప్రవేశానికి అర్హత పొందాడు. దీంతో విద్యార్థిని పాఠశాల హెచ్‌ఎం ఎం.శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ జగదీష్

శ్రీకాకుళం అర్బన్: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషక విలువలున్న ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆయుర్వేద వైద్యుడు పి.జగదీష్ అన్నారు. ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోని కృష్ణాపార్క్ సెక్టార్‌లో పుణ్యపు వీధి, కానుకుర్తివారి వీధి, గాజులవీధి, అంగన్వాడీ కేంద్రాల్లో గురువారం పోషణ–పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ పోషక విలువలున్న ఆకు కూరలు, కాయగూరలను వినియోగిస్తే రక్త హీనత తగ్గుతుందన్నారు. అనంతరం పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా పర్యవేక్షకులు పి.సీతామహాలక్ష్మి చిన్నారుల బరువును తూయించారు. పోషక విలువలున్న వంటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సంధ్యారాణి, పైడి రాజు, రాణి, సావిత్రి, సాయి భవాని, పుష్ప, రోజా పాల్గొన్నారు.

ఘనంగా కాళీమాత ఆలయ వార్షికోత్సవం



ఇచ్ఛాపురం: పురపాలక సంఘంలోని డబ్బూరి వీధి దక్షిణ కాళీమాత ఆలయం మొదటి వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి తైల, సింధూర మర్దనలు, పంచగవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు చేసి ప్రత్యేకంగా ఆలంకరించారు. చండీపారాయణం, హోమం నిర్వహించారు. సాయంత్రం 132 మందితో సామూహిక కుంకుమ పూజలు చేయించి అమ్మవారికి 36 ప్రత్యేక హారతి ఇచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించాలి


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న గొర్లె పరిమళ

రణస్థలం: రానున్న ఎన్నికల్లో ఎచ్చెర్ల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎమ్మెల్యే కిరణ్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన సతీమణి, రణస్థలం మాజీ ఎంపీపీ గొర్లె పరిమళ కోరారు. మండల కేంద్రంలోని జి.సిగడాంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడపగడపకు వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఎంపీపీ మీసాల సత్యవతి, మండల మహిళా కన్వీనర్ కంది రమాదేవి, సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ, ఎంపీటీసీ కిర్తి తవుడమ్మ, మండల మహిళా అధ్యక్షురాలు వాన ప్రమీల, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్పొరేషన్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న పిరియా విజయ

ఇచ్ఛాపురం రూరల్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత అలవర్చుకుంటే ప్రశాంతతతో పాటు సరైన జీవన శైలి సమకూరుతుందని జెడ్పీ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పిరియా విజయ అన్నారు. సన్యాసిపుట్టుగలో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠాపన సందర్భంగా గురువారం స్వామి వారిని, యజ్ఞ మండపాన్ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్ గుజ్జు ఢిల్లీరావు, డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ నల్ల సుగుణ, ఎంపీటీసీ సభ్యురాలు ఆశి మందాకిని, జేసీఎస్ కన్వీనర్ ఆశి పురుషోత్తమరెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి నల్ల దేవరాజు, నీలాపు చంద్రయ్య, రాంపల్లి చిట్టిబాబు, కాళ్ల దేవరాజు, కొప్పల హేమంత్, బుడత ప్రకాష్, నీలాపు గోపి, బాగ మోహనరావు, మాసునత్రి ఉమాపతి పాల్గొన్నారు.

న్యాయవాదుల సంక్షేమానికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ని సూర్యారావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా బార్ అసోసియేషన్ అభివృద్ధి, న్యాయవాదుల సంక్షేమానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నానని, మరోసారి తనకు అవకాశం కల్పించి గెలిపించాలని జిల్లా బార్ అసోసియేషన్ ఆపద్ధర్మ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులకు విజ్ఞప్తి చేశారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ న్యాయవాదులందరి సహకారంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించానని, హైకోర్టు న్యాయమూర్తులతో పలు నూతన భవనాలకు శంకుస్థాపనలు చేసినట్టు వివరించారు. కన్స్యూమర్ కోర్టు దూరంగా ఉండడం వల్ల న్యాయవాదులు ఇబ్బందులు పడుతున్నారని, దానిని కూడా రానున్న రోజుల్లో జిల్లా కోర్టు ఆవరణలోనే ఏర్పాటు చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 2024–25 సంవత్సరానికి గానూ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా మరొకసారి అవకాశం కల్పిస్తే మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. సమావేశంలో బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆగూరు ఉమామహేశ్వరరావు, బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మణరావు, జర్నలిస్టు సంఘం నాయకుడు కొంక్యాన వేణుగోపాలరావు, న్యాయవాదులు గేదెల ఇందిరా ప్రసాద్, బి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఓటీఏ కార్యవర్గ ఎన్నిక


పలాసలో ప్రమాణస్వీకారం చేస్తున్న ఉపాధ్యాయులు

పలాస: ఆంధ్రప్రదేశ్ ఒరియా టీచర్స్ అసోసియేషన్ (ఓటీఏ) పలాస–వజ్రపుకొత్తూరు మండల శాఖ అధ్యక్షునిగా నల్ల నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పలాస మండలం రెంటికోట ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం కేంద్ర కమిటీ కన్వీనర్ నల్ల గోవిందరాజు పర్యవేక్షణలో ఈ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారిగా చక్రపాణి ప్రధాన్‌గా వ్యవహరించారు. ముఖ్య కార్యదర్శిగా నాగేశ్వర్ పాత్రో, ఉపాధ్యక్షునిగా దుర్గాప్రసాద్ మహంతి, సంయుక్త కార్యదర్శిగా ఎస్.జనార్ధనరావు, కోశాధికారిగా బాలాజి పాత్రో, గౌరవ అధ్యక్షులుగా ఖగేశ్వరదొర, లక్ష్మీ నరసింహపండా, నీలకంఠ పాత్రో, చంద్రశేఖర్ బెహరా, విజయ పాణిగ్రాహి, మీనకేతన్ మిశ్రో, కృష్ణపాత్రో ఎంపికయ్యారు.

శామ్యూల్ సేవలు చిరస్మరణీయం


విజయరత్నంను సత్కరిస్తున్న క్రైస్తవ సోదరులు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లాలో క్రీస్తు సువార్తను గ్రామ గ్రామాన ప్రచారం చేసిన వ్యక్తి గోడి శామ్యూల్ అని పలువురు వక్తలు కొనియాడారు. శ్రీకాకుళం మహిళా కళాశాల రోడ్డులో ఉన్న క్రిస్టియన్ వర్షిప్ సెంటర్‌లో గురువారం గోడి శామ్యూల్ జ్ఞాపక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ డీఎస్‌వీఎస్ కుమార్ మాట్లాడుతూ పేద పిల్లలను అనేక మందిని శామ్యూల్ పోషించారని గుర్తు చేశారు.

అనంతరం శామ్యూల్ సతీమణి విజయరత్నంని సన్మానించారు. కార్యక్రమంలో రెవ.ఆర్.సద్గుణరావు, బిషప్ ఎ.శామ్యూల్ మోసెస్, బిషప్ కె.విశ్వాసరావు, దనాయందం, పాస్టర్ ప్రేమ్‌కుమార్, యశయా, క్రిస్టోఫర్, డాక్టర్ జాన్ జీవన్, అలజంగి నవీన్‌కుమార్, అన్ని మండలాల పాస్టర్స్ పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు


కారును తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్


హిరమండలం: ధనుపురం వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

బూర్జ: మండలంలోని నీలాదేవిపురం గ్రామం ప్రధాన రహదారిపై ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది ముమ్మరంగా తనిఖీ నిర్వహించారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల ప్రకారం రెవెన్యూ, పోలీసు అధికారుల ఆధ్వర్యంలో శ్రీకాకుళం–పాలకొండ రోడ్డులో గురువారం వాహనాలు తనిఖీలు చేపట్టారు. సివిల్ సప్లయ్ డీటీ ఎస్.వెంకటరావు, ఏఎస్సై వై.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

హిరమండలం మండలంలో..

హిరమండలం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసు అధికారులు వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. మండలంలోని ధనుపురం, గొట్టాబ్యారేజీ, హిరమండలం ప్రధాన రహదారుల్లో పోలీసులు, ఫ్లయింగ్ స్కాడ్ సిబ్బంది గురువారం వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఏఆర్ ఎస్ఐ అప్పారావు మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీసుల శాఖల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా రూ.50 వేలకు మించి నగదు తీసుకువెళ్తే వాటికి సంబంధించిన పత్రాలు విధిగా చూపాలన్నారు. తనిఖీల్లో పోలీసులకు సహకరించాలని కోరారు.

అడవులే రక్షణ కవచాలు


మాట్లాడుతున్న సింహాచలం

శ్రీకాకుళం అర్బన్ : మానవ మనుగడకు చెట్లు ఎంతో ఉపకరిస్తాయని, అడవులు రక్షణ కవచాలుగా నిలుస్తాయని శ్రీకాకుళం నగరానికి చెందిన స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. గురువారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ అటవీ దినోత్సవం నిర్వహించారు. విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి చెంచులావు సింహాచలం మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నడక సంఘాల మాజీ గవర్నర్ జి.ఇందిరా ప్రసాద్, స్టార్ వాకర్స్ క్లబ్ కో–ఆర్డినేటర్ ఎస్.జోగినాయుడు, అధ్యక్షుడు బి.వి.రవిశంకర్, కార్యదర్శి బి.దేవీప్రసాద్, పాలకొండ ప్రశాంత్, కొండలరావు, స్టార్ మహిళా అధ్యక్షురాలు గేదెల లక్ష్మి, ప్రతినిధులు పాల్గొన్నారు.